

సాక్షి
బాపట్ల
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 588.70 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 53,685 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 29,820 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,773 క్యూసెక్కు లు వదులుతున్నారు.



భక్తి సంగీత విభావరి

నగరంపాలెం(గుంటూరు): బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

న్యూస్‌రీల్

భావన్నారాయణుడిని దర్శించుకున్న జడ్జి



బాపట్ల: పట్టణంలోనిశ్రీ భావన్నారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రేపల్లె: జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.పి.డి. వెన్నెల సూచించారు.పట్టణంలోని సబ్‌జైల్‌ను శనివారం ఆమె సందర్శించి, రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పులతో జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. ఇక నుంచైనా తప్పులు చేయకుండా కుటుంబ సభ్యులతో చక్కని జీవితాన్ని గడపాలని ఆమె సూచించారు. జైలులో విరామ సమయంలో పుస్తక పఠనం చేయాలని చెప్పారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించి, ఉచిత న్యాయ సహాయం పొందే విధానంపై వివరించారు. ఈ సందర్భంగా జైలులో కల్పిస్తున్న సౌకర్యాలపై రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం తగదు

చేనేత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురుగుడు సత్యనారాయణ



చీరాల రూరల్: ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చే శారు. ఈపురుపాలెంలో శనివారం నిర్వహించిన సంఘ ఏరియా కమిటీ సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు హామీలు ఇచ్చి 14 నెలలు పూర్తయినా ఇంతవరకూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు ఏడాదికి 25 వేల ఆర్థిక సాయం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, ఆప్కో బకాయిలు వెంటనే విడుదల చేయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తృప్తి ఫండ్ కంట్రిబ్యూషన్ మొత్తం రూ. 27 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు గద్దె హేమసుందరరావు, జిల్లా వృత్తి సంఘాల సమన్వయ కమిటీ కార్యదర్శి టి. కొండయ్య, చేనేత నాయకులు ఎర్ర రాధాకృష్ణ, అనుభం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీజిల్ ట్యాంక్ పేలి కంటైనర్ దగ్ధం



యద్దనపూడి: టైరు పేలి కంటైనర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టటంతో డీజిల్ ట్యాంక్ పగిలి దగ్ధమైన సంఘటన తాతపూడి వద్ద శనివారం చోటు చేసుకుంది. హైవే మొబైల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళగిరి నుంచి చెన్నై పేపర్ లోడుతో వెళుతున్న కంటైనర్ టైరు తాతపూడి వద్దకు రాగానే ఒక్కసారిగా పేలింది. దీంతో అదుపుతప్పిన వాహనం డివైడర్‌ను ఢీకొనడంతో డీజిల్ ట్యాంక్ నుంచి మంటలు రేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జర్నలిస్టులను వేధించే హక్కు ఎవరిచ్చారు ?



వేమూరు: అంబేడ్కర్ రాజ్యాంగంలో పత్రికలకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ గురించి రాశారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి విలువ ఇవ్వకుండా జర్నలిస్టులను వేధించడం అన్యాయం. ఏ పౌరుడికైనా స్వేచ్ఛగా మాట్లాడే హక్కు, భావాలను వ్యక్తీకరించే హక్కు ఉంది. జర్నలిస్టులకు కూడా ఇవి వర్తిస్తాయి. వారిని వేధించడం, దాడులు చేసే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు. కూటమి ఆగడాలను రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారు. జర్నలిస్టులపై దాడుల్ని ప్రజా సంఘాలు కూడా ఖండించాల్సిన అవసరం ఉంది.

– వరికూటి అశోక్‌బాబు,
వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ అధికారి ప్రతినిధి,

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం



బాపట్ల: పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అధికారంలోకి రాగానే సాక్షి పత్రికపై దాడులు ప్రారంభించింది. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలని చూస్తోంది. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెడితే సమాచారాన్ని బయటకు రాకుండా చేయగలు తామనే కుట్ర పూరితంగా వ్యవహరించడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం సాక్షిపై కక్షపూరిత దాడులను మానుకోవాలి.

– కోన రఘుపతి, మాజీ డెప్యూటీ స్పీకర్



పేదల రక్తం షేర్

- చీరాల ప్రాంతంలో కొత్త రకం జూదం
- షేర్ మార్కెట్ ఆధారంగా దోపిడీ
- పట్టించుకోని పోలీసులు



చీరాల టౌన్: షేర్ మార్కెట్‌తో ఎలాంటి సంబంధం లేకుండా చీరాలలో కొత్త తరహా జూదం నడుస్తోంది. సెన్సెక్స్‌లో చివరి అంకె.. నిఫ్టీలో చివరి అంకెను కలిపి ఒక సంఖ్యగా మార్చుతారు. ఈ రెండు సంఖ్యలు కలిపి లెక్కించగా 90 వస్తే బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి 60 రెట్లు అధికంగా డబ్బు చెల్లిస్తామని ఆశ పెట్టి పేదల కష్టాన్ని కాజేస్తున్నారు.

గ్రామాల్లోనూ దందా

చీరాల పట్టణంతో పాటు గ్రామాల్లోనూ ఈ దందా సాగుతోంది. రూ.100 పెట్టుబడి పెడితే రూ. 5వేలు వస్తాయనే ఆశ చూపుతున్నారు. ముఖ్యంగా ఈపురు పాలెం, తోటవారిపాలెం, 300 కాలనీ, జాండ్రపేట, పేరాల, వేటపాలెం తదితర ప్రాంతాల్లోనే ఈ జూదం నడుస్తోంది. పోతే రూ.500 వస్తే రూ. 30వేలు అనే భావనతో ఎక్కువ మంది పేదలు ఈ జూదంలో డబ్బులు కట్టి అప్పుల పాలవుతున్నారు.

దోపిడీ ఇలా

క్లోజింగ్ సమయానికి షేర్ మార్కెట్‌లో ఆఖరున ఫలానా నంబర్ వస్తుందని బెట్టింగ్ కడతారు. ముందుగానే ఏజెంట్‌కు డబ్బులు చెల్లించి ఒక పేపర్ తీసుకుంటారు. ఒకవేళ తాను కట్టిన నంబర్ (అరుదుగా వస్తుంది)షేర్ మార్కెట్ ఆఖరున వస్తే డబ్బులు చెల్లిస్తారు ఏజెంట్లు. లేకపోతే కట్టిన డబ్బులు హుష్. ఇంత జరుగుతున్నా పోలీసులు కట్టడి చేయలేకపోతున్నారే విమర్శలు ఉన్నాయి.

వన్‌టౌన్ పరిధిలోనే అధికం

చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే అధికంగా సింగిల్ నంబర్, షేర్ మార్కెట్, బ్రాకెట్, ఆటలు జరుగుతున్నాయి. పట్టణంలోని దర్బార్ రోడ్డులో రెడ్డీ టీస్టాల్ ఎదురుగా ఉన్న సాంబశివ స్వీట్ షాప్ వద్ద, టీ ప్యాలెస్ ఎదురు రోడ్డు, ప్రసాద్ థియేటర్ సమీపంలో, దేవాంగపురిలోని రచ్చబండ వద్ద, వేటపాలెం రైల్వేస్టేషన్, జాండ్రపేట రైల్వే స్టేషన్ వద్ద, పట్టణంలోని నల్లగాంధీ బొమ్మ సెంటర్‌లో గుంపులుగా పేదలు నుంచి జూదంలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే ఇదంతా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం

చీరాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకున్నాం. నంబర్ల ఆట, ఇతర జూదాలపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. స్టేషన్ పరిధిలో జూదాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఎవరైనా పేదలను అధిక డబ్బులు ఆశచూపి జూదాలకు పాల్పడుతుంటే సమాచారం అందించండి.

– ఎస్.సుబ్బారావు, వన్‌టౌన్ సీఐ

● మర్యాదపూర్వక కలయిక





రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ కృతికాశుక్ల, ఎస్పీ బీ కృష్ణారావు

రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నాగార్జునకొండ పర్యటనలో భాగంగా శనివారం తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా హిల్‌కాలనీ జీసీ స్కూల్ ఆవరణలో కుటుంబ సమేతంగా హెలికాప్టర్‌లో దిగారు. ఆయన్ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి. కృష్ణారావు, గురజాల ఆర్డీఓ వి. మురళీకృష్ణలు హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ జగదీష్, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల టౌన్ సీఐ ప్రభాకర్, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్, పలువురు పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు. - విజయపురిసౌత్

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి



తీవ్రంగా గాయపడిన నాగేంద్రకుమార్

చీరాల: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాలు దాడి చేసుకున్న సంఘటన శనివారం వేటపాలెం మండలం పందిళ్లపల్లిలో చోటు చేసుకుంది. ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పందిళ్లపల్లికి చెందిన నాగేంద్రకుమార్, రామాంజనేయులు అన్నదమ్ములు. వీరికి అదే ప్రాంతానికి చెందిన కోలా వెంకటేశ్వర్లుతో పాత వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఇరు వర్గాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. కోలా వెంకటేశ్వర్లు కత్తితో నాగేంద్రకుమార్, రామాంజనేయులపై దాడి చేసి గాయపరిచాడు. ఇద్దరు గాయపడటంతో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అన్నదమ్ములు తనపై దాడి చేసి గాయపరిచారని కోలా వెంకటేశ్వర్లు కూడా చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలలో చేరాడు. ఈ మేరకు ఇరు వర్గాల వద్ద ఔట్‌పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి



కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

బాపట్ల: 'పరిశుభ్రత వైపు ఒక అడుగు' నినాదంతో స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలని, ప్రజారోగ్యం, పర్యావరణ స్థిరత్వం దిశగా ప్రతి అడుగూ కృత నిశ్చయంతో వేయాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జి డీన్ ఎస్.ఆర్. కోటేశ్వరరావు తెలిపారు. ప్రతి నెలా మూడవ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు ఈ సామాజిక ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణతో ప్లాస్టిక్ భూతాన్ని భూతలం నుంచి పారదోలాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల దాపురిల్లే భయంకరమైన పరిణామాల గురించి వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల వల్ల విలువైన పశు సంపద బలి కావడం దారుణమని తెలిపారు. దీని వల్ల పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటుందని, యువత అప్రమత్తంగా ఉండి స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణను విద్యార్థులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.రమాదేవి, సి. సంధ్యారాణి, జి.విజయకుమార్, షేక్ అబ్దుల్ సలాం, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట సంబరాల్లో టీడీపీ నేతల వీరంగం

- సుంకం చెల్లిస్తేనే కార్యక్రమాలు జరపాలంటూ ఆదేశం
- పోలీసుస్టేషన్‌కు చేరుకున్న గ్రామస్తులు, మహిళలు
- సమస్య పరిష్కారానికి ఎస్ఐ హామీ
- వెనుదిరిగిన మహిళలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐనవోలు ఎస్ఐ

సాక్షి టాస్క్‌ఫోర్స్: నూజెండ్ల మండలం పమిడిపాడులో గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ట సందర్భంగా టీడీపీ నాయకులు వీరంగం సృష్టించారు. గ్రామంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గ్రామస్తులు విరాళాలు సేకరించారు. ప్రతిష్ట అనంతరం అన్నదాన సంతర్పణ సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ నేత అనుచరులతో వచ్చి భోజనం చేస్తున్న వారితో ఘర్షణకు దిగాడు. అక్కడ ఉన్న నిర్వాహకులు ప్రతిష్ట సజావుగా జరగాలని ప్రాధేయ పడినప్పటికీ భోజనం బల్లలను, వంట సామగ్రి పడివేసి గందరగోళం సృష్టించాడు. అంతే కాకుండా గ్రామంలో ఎటువంటి కార్యక్రమం జరిగినా తమకు సుంకం చెల్లించాలని, లేనిపక్షంలో కార్యక్రమాలు నిర్వహించటానికి వీల్లేదని హెచ్చరించాడు. గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో వినుకొండ పట్టణంలో ఉన్న ఐనవోలు పోలీసుస్టేషనుకు చేరుకొని ఎస్ఐ ఎదుట మొరపెట్టుకున్నారు. గ్రామంలో టీడీపీ నేతల ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని, ఏ పని చేయాలన్నా సుంకం చెల్లించాలని లేకపోతే వేధింపులకు గురిచేస్తున్నారని ఎస్ఐ ముందు కన్నీటి పర్యంతమయ్యారు. శుక్రవారం రాత్రి సమయంలో మహిళలు పోలీసుస్టేషను ఎదుట రెండు గంటల నిరీక్షించారు. స్పందించిన ఎస్ఐ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో గ్రామస్తులు తిరిగి గ్రామానికి వెళ్లారు.

నరసరావుపేటలో కాటికాపరి హత్య



ఘటనా స్థలంలో ఎఫ్రాన్ మృతదేహం

నరసరావుపేట రూరల్: కాటి కాపరి హత్యకు గురైన ఘటన నరసరావుపేట శివారులోని స్వర్గపురి–2లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని క్రిస్టియన్‌పాలేనికి చెందిన గాడిపర్తి ఎఫ్రాన్(31) కొంతకాలంగా స్వర్గపురి–2 శ్మశానవాటికలో కాటికాపరిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఎఫ్రాన్ స్వర్గపురిలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికి చంపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, వన్‌టౌన్ సీఐ ఫిరోజ్‌ఖాన్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిశోర్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: జిల్లాలో ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశం మందిరంలో శుక్రవారం మత్స్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని వ్యవస్థీకృత పరిశ్రమగా మార్చి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆక్వా కల్చర్ కార్యకలాపాలు, ఉత్పత్తులు, సేవలను ఒకే గొడుగు కిందికు తీసుకు రావడానికి జలచరాభివృద్ధి సంస్థ చట్టం–2020ను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. చట్టం విధి విధానాలు, అమలు, లక్ష్యాలపై మత్స్యశాఖ అధికారులతో కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఆక్వా కల్చర్ సాగు చేసే వారంతా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని ఆయన ఆదేశించారు. గ్రామ సచివాలయంలో స్వయంగా లేదా డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఈ– మత్స్య కార్ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆక్వా కల్చర్‌ను అభివృద్ధి చేయడానికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసైన్డ్ భూముల్లో ఆక్వా కల్చర్ సాగు చేసే వారి వివరాలను మత్స్యశాఖ అధికారుల నుంచి ఆరా తీశారు. భూములు ఎవరికైతే ఇచ్చారో వారి కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఆక్వా కల్చర్ 9,579.44 హెక్టార్లలో సాగు అవుతుండగా, ఇందులో 6257.59 హెక్టార్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ అయినట్లు చెప్పారు. మిగిలిన 3321.85 హెక్టార్ల భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్ నాయక్, డీడీ గాలి దేవుడు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపులపై విస్తృత అవగాహన కల్పించాలి

బాపట్ల: సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సూచించారు. షాపింగ్ సండడి కార్యక్రమాల నిర్వహణపై వాణిజ్య పన్నులశాఖ అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో ఉత్పత్తులు, వస్తువుల ధరల పట్టికను ప్రతి దుకాణంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మందులు దుకాణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణాలలో బోర్డులు ఉండాలని తెలిపారు. వస్తువుల ఉత్పత్తి ప్రాంతాలు, హోల్ సేల్ కేంద్రాలు, రిటైల్ దుకాణాల వద్ద కూడా బోర్డులు ఉండాలని చెప్పారు. మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా విస్తృత ప్రచారం చేయాలని ఆయన కోరారు. వాల్ పోస్టర్లు, కరపత్రాలు దుకాణాలలో కనిపించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాపట్ల పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా షాపింగ్ సండడి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలను చైతన్యపరిచి, ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలను వివరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారి గ్లోరియా పాల్గొన్నారు.

రూ. పది లక్షలిస్తే దుకాణం పదిలం!

- గుంటూరు నగర పాలక సంస్థ అధికారుల దందా
- కొల్లి శారద మార్కెట్ దుకాణాల కోసం వసూళ్లు
- న్యాయం చేయాలని వ్యాపారుల ఆందోళన



అన్నపూర్ణ కాంప్లెక్స్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నెహ్రూనగర్: నగరంలోని కొల్లి శారద మార్కెట్ పాత లీజుదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. 25 సంవత్సరాలుగా ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకుంటున్న తమను లీజు గడువు పూర్తయిందంటూ హడావుడి చేసి బయటకు పంపారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముడుపులు ఇస్తే రెన్యూవల్?

మార్కెట్‌లో 81 షాపులున్నాయి. ఒక్కో దానికి రూ.10 లక్షల చొప్పున రూ.8.10 కోట్లు ఇస్తే రెన్యూవల్ చేస్తామని నగరపాలక సంస్థ అధికారులు మధ్యవర్తుల ద్వారా చెప్పారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. అంత స్తోమత లేక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక్కడికి కూడా వచ్చి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క తాము రైతులను కొల్లి శారద మార్కెట్‌కు వెళ్లనివ్వడం లేదనడం సమంజసం కాదని వాపోతున్నారు.

లీజుకు ముందు చెప్పలేదు..

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్‌లో వ్యాపారులను నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా 1999లో అప్పటి కమిషనర్ కృష్ణబాబు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లి శారద మార్కెట్‌కు తరలించారు. మార్కెట్‌కు వెళ్లే ముందు లీజు గడువు విషయం తమకు చెప్పలేదని తెలిపారు. ఈ క్రమంలో 2013లో జీఓ వచ్చిందని నగరపాలక సంస్థ అధికారులు హడావుడిగా షాపులను ఖాళీ చేయాలని, బహిరంగ వేలం పెట్టాలని చెప్పారు. మరో పక్క ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో పోలీసులు ఇబ్బందులను తట్టుకోలేక బుడంపాడు బైపాస్ వద్ద నాలుగు ఎకరాల స్థలం కొనుగోలు చేశామన్నారు. అనుమతులు ఇవ్వాలని నగరపాలక సంస్థ అధికారులను కోరినా కుదరదన్నారని వ్యాపారులు చెప్పారు. లీజు గడువు పూర్తయిందని హడావుడిగా వేలం పాట పెట్టేశారన్నారు. ఒక్కో షాపు రూ.లక్ష నుంచి రూ.6.50 లక్షల వరకు పలికిందని చెప్పారు అంత పెట్టి వ్యాపారం చేయలేమని బుడంపాడు బైపాస్ వద్ద ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ లోకి వెళ్లామన్నారు. వ్యాపారం చేయడానికి వీల్లేదని అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు వాపోయారు.

ప్రత్యామ్నాయం చూపాలి

రూ.లక్షలు కట్టి తాము కొల్లి శారద మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే పరిస్థితులు లేవని వ్యాపారులు తెలిపారు. తాము ప్రైవేట్ స్థలంలో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని అధికారులు చెప్పడంతో మార్కెట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఇంత వరకు స్పందన లేదని చెప్పారు. అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేసుకోనివ్వడం లేదని వాపోయారు.

క్లుప్తంగా

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని కాకాని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురకాయపాలెం పాఠశాలలో శనివారం 356 మంది విద్యార్థినులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజక వర్గంలో 10 వేల సైకిళ్లు పంపిణీ చేయాలని సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. అనంతరం కొరిశపాడు మండలం మేదరమెట్లలో ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం మేదరమెట్ల–తమ్మవరం బీటీ రహదారిని ప్రారంభించారు. కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు కారంచేడు విద్యార్థి ఎంపిక



కారంచేడు: త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న బ్యాడ్మింటన్ పోటీలకు కారంచేడుకు చెందిన యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి ఎంపికయ్యాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సింగరాయకొండ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఈనెల 17వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బుచ్చయ్య చౌదరి విజయం సాధించాడు. హెచ్ఎం ఎం. సామ్రాజ్యం, పీడీ షేక్ మస్తానీ, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

బెంగళూరులో ఇసుకదర్శి వాసి ఆత్మహత్య

మార్టూరు: మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వెంకట రమణయ్య (65) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల కిందట బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న కుమార్తె వద్దకు వెళ్లాడు. అక్కడ ఉదయం నిద్ర లేచేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం గమనించిన కుమార్తె స్వగ్రామంలో బంధువులకు సమాచారం అందించింది. మృతదేహాన్ని సాయంత్రం అక్కడకు తరలించారు.

టీడీపీ కనుసన్నల్లోనే నకిలీ మద్యం కుంభకోణం

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపోలూరి వెంకటరెడ్డి



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో టీడీపీ నేతల కనుసన్నల్లో జరిగిన నకిలీ మద్యం కేసుకు సంబంధించి ఏడాదిన్నర పాలనలో రూ.కోట్లు దండుకున్నారని, తిరిగి వారే దొంగ.. దొంగ.. అని అరిచిన చందాన వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు నకిలీ మద్యం కేసులో పట్టుబడ్డారని తెలిపారు. దాన్ని వైఎస్సార్ సీపీ నేతలకు ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు. జనార్దన్‌రావును అరెస్ట్ చేసిన తరువాత ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్ట్‌లో ఎందుకు జోగి రమేష్ పేరు చెప్పలేదని నిలదీశారు. ఆ తరువాత వీడియో రిలీజ్ కావటంలో ఉన్న ఆంతర్యం అందరికీ తెలుసున్నారు. జనార్దన్‌రావుతో ఒక వీడియో రికార్డ్ చేయించుకుని సోషల్ మీడియా ద్వారా టీడీపీ తొత్తులుగా ఉన్న చానల్స్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తూ వైఎస్సార్ సీపీ నేత జోగి రమేష్‌పై అభాండాలను వేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీన్ని న్యాయవాదులుగా ఖండిస్తున్నామన్నారు. నకిలీ మద్యం కేసు కోర్టు విచారణలో ఉండగా, టీడీపీ వ్యక్తులు ఐవీఆర్ఎస్, ఫోన్‌కాల్స్ ద్వారా వైఎస్సార్ సీపీ నకిలీ మద్యం ఏ విధంగా తయారు చేసిందో, జనార్దనరావు మాటల్లో వినమని చెప్పి, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ఎలా కాల్స్ వస్తాయని ప్రశ్నించారు. ఇది కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్ర కాదా అని దుయ్యబట్టారు. దీనిపై సీబీఐ ఎంక్వైరీ వేసి కోర్టు విచారణలో ఉన్న అంశంపై ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 9179713 19649 నంబర్ నుంచి తనకు కాల్ రావటం జరిగిందని, దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. లేని పక్షంలో న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామని వెంకటరెడ్డి హెచ్చరించారు.

దేశం బలోపేతానికి ఎల్ఐసీ కీలకం



కార్యక్రమంలో సతీష్, లక్ష్మణరావు, సుధాకర్ తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ – మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభలు శనివారం స్థానిక ఎన్జీఓ కల్యాణ మండపంలో జరిగాయి. జోనల్ అధ్యక్షులు పి.సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల స్వదేశీ నినాదమిచ్చిన కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో విదేశీ ఈక్విటీని వంద శాతానికి పెంచాలని నిర్ణయించడం దేశ ప్రయోజనాలకు హానికరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ బీమా ఉద్యోగులు సంస్థను కాపాడుకునేందుకు సమైక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, ఎల్ఐసీ ఆఫీసర్స్ ప్రధాన కార్యదర్శి కోటేశ్ బాబు, డెవలప్‌మెంట్ అధికారుల కార్యదర్శి సురేష్ బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిశోర్ కుమార్, మహిళా కన్వీనర్ సీహెచ్ మధుబాల పాల్గొన్నారు.

నవంబర్‌లో బాల కళాప్రభ ఉత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న రాధాకృష్ణమూర్తి, గురుదత్, రాజేష్, ఉమాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: బాలానంద కేంద్ర ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు రుద్ర కళాక్షేత్రం సహకారంతో 'బాల కళాప్రభ–2025 పేరుతో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవ, పోటీలను నవంబర్ 8, 9వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు బాలానంద కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, నడింపల్లి వెంకట గురుదత్ పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేట రెండో లైను లోటస్ ఆద్య పాఠశాలలో కార్యక్రమాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రుద్ర కళాక్షేత్రం నిర్వాహకుడు మాచిరాజు రాజేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక కూచిపూడి నృత్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు నృత్య ప్రభ (సోలో), నృత్యమణి (గ్రూపు) పేరుతో పోటీలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, తెలుగులో మాట్లాడదాం, చిత్రలేఖనం, రంగులు వేద్దాం రండి, శాస్త్రీయ గాత్ర సంగీతం, లలిత గీతాలు, వాద్య సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా అంశాల్లో జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలను నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని వివరించారు. పాల్గొనదలచిన వారు 91826 85890, 89199 81839, 90300 88020, 738215 3390 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లోటస్ ఆద్య పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వై.ఉమాదేవి, పి.కిరణ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మార్టూరు: ఇసుక దర్శి గ్రామ పొలాల్లోని వ్యవసాయ బావిలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం శనివారం బయటపడింది. నడుముకు, కాలికి తాళ్లతో కట్టిన రాళ్లు వేళ్లాడుతుండటంతో హత్యగా అనుమానిస్తున్నారు. కొనంకి గ్రామ పరిధిలోని వలపర్లకు చెందిన వెచ్చా బుజ్జయ్య వ్యవసాయ బావిలో మృతదేహం ఉండటతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శేషగిరిరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని స్థానికుల సహకారంతో బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహం సుమారు ఐదు రోజుల నుంచి బావిలో ఉండొచ్చని, వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యద్దనపూడి: అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చింతపల్లిపాడులో చోటు చేసుకుంది. చింతపల్లిపాడు ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల చిట్టిబాబు (46) భార్య 2015లో మరణించింది. దీంతో ఇద్దరు సంతానంతో తల్లి వద్దే ఉంటున్నాడు. చిట్టిబాబు కొంత పొలం కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. పిల్లల చదువు కోసం, వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు చిలకలూరిపేట ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని సోదరుడు చినభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు.

రైల్వే జనరల్ టికెట్ల కొనుగోలుకు యాప్



లక్ష్మీపురం: రైల్వే శాఖ 2018లో జనరల్ ప్రయాణికుల కోసం యూటీఎస్ యాప్ తెచ్చిందని అధికారులు తెలిపారు. డివిజన్లలో పూర్తిస్థాయిలో వినియోగించేలా ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు గుంటూరు రైల్వే డీఆర్ఎం సుథేష్ఠ సేన్ గుంటూరు పట్టాభిపురంలోని తన కార్యాలయంలో శుక్రవారం యాప్ లోగో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్ వినియోగం గురించి ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో సీజన్, ప్లాట్‌ఫారం, సాధారణ ప్రయాణ టికెట్లను కూడా బుక్ చేసుకోవచ్చన్నారు. సీజన్ టికెట్ల రెన్యూవల్ ముందుగానే చేసుకోవచ్చని సూచించారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్ బాబులు దీనిపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

యోగా పోటీలకు వేటపాలెం విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

వేటపాలెం: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని శనివారం తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్– 19 యోగా ఎంపిక పోటీలు సింగరాయకొండలో నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో ఎనిమిదో తరగతి విద్యార్థినులు కె. కావ్య, షేక్ ఆసిఫా యోగా రిథమిక్ డబుల్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఆమె వివరించారు. ఈ నెలలో నెల్లూరులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు జె. దేవభిక్షం, జె. శ్రావణి విద్యార్థినులను అభినందించినట్లు పేర్కొన్నారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధురాలి ఆత్మహత్య



వెంకటసుబ్బమ్మ

కొల్లూరు : అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఓ వృద్ధురాలు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం కొల్లూరులో చోటు చేసుకుంది. మండలంలోని సుగ్గునలంకకు చెందిన సుగ్గున వెంకటసుబ్బమ్మ (75) కొంత కాలంగా ఉబ్బసం, ఆయాసంతో బాధ పడుతోంది. ఇటీవల గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి చేరింది. అనారోగ్య సమస్యలు నయం కాకపోవడంతో కొల్లూరు లాక్ సెంటర్‌లో పశ్చిమ బ్యాంక్ కెనాల్‌లోకి దూకింది. స్థానికంగా చేపలు విక్రయించే వ్యక్తులు గమనించి నీటిలో కొట్టుకుపోతున్న ఆమెను పట్టుకొని ఒడ్డుకు తీసుకువచ్చారు. తాగిన నీటిని కక్కించి రక్షించేందుకు విఫలయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. వెంకటసుబ్బమ్మ మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు. అయితే, దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని వారు వెల్లడించారు.

జీఎస్టీ తగ్గడంతో దిగొచ్చిన విద్యుత్ పరికరాల ధరలు

- సోలార్ ఏర్పాటు చేసుకునే వారికి ప్రయోజనం
- విద్యుత్‌శాఖ అధికారుల అవగాహన ర్యాలీ



ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా అధికారి విజయకుమార్

నరసరావుపేట: సూపర్ సేవింగ్స్–సూపర్ జీఎస్టీ వల్ల విద్యుత్ పరికరాల ధరలు తగ్గాయని విద్యుత్ శాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్తు పెట్టుకునేందుకు ముందుకు వచ్చే వారికి లాభం కలుగుతుందని తెలిపారు. శనివారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్, సోలార్ విద్యుత్ అవగాహన ర్యాలీకి స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో పచ్చజెండా ఊపి ప్రారంభించి అందులో పాల్గొన్నారు. ర్యాలీ శివుడు బొమ్మ సెంటర్ మీదుగా ప్రధాన రహదారిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు, అక్కడి నుంచి పాండురంగస్వామి దేవాలయం మీదుగా కోట సెంటర్ నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు కొనసాగింది. విద్యుత్ శాఖ సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని దారి పొడవునా కరపత్రాలు పంపిణీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబొట్లు మాట్లాడుతూ గృహ వినియోగదారులకు అదనపు లోడు ఉంటే 50 శాతం రాయితీ ద్వారా క్రమబద్ధీకరణ పథకం ఉందని తెలిపారు. దీన్ని ప్రతి ఒక్క గృహ వినియోగదారుడు ఉపయోగించుకోవాలని కోరారు. ర్యాలీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్లు రఫీ, సురేంద్రబాబు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు సాంబశివరావు, మౌళి, ప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా బాధ్యుల నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సోషల్ మీడియా విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఉపాధ్యక్షులుగా నన్నపునేని వెంకటరావు (వినుకొండ), జక్కిరెడ్డి నాగిరెడ్డి (మాచర్ల), షేక్ మాబు జానీ(గురజాల), జేఎస్‌కే జానీ (సత్తెనపల్లి), ప్రధాన కార్యదర్శులుగా గెల్లి మల్లికార్జునరెడ్డి(నరసరావుపేట), గుడిసె నాగిరెడ్డి (పెదకూరపాడు), చిన్నపురెడ్డి సునీల్‌రెడ్డి (చిలకలూరిపేట), కార్యదర్శులుగా డి.శివకేశవ లింగం(సత్తెనపల్లి), పఠాన్ షారూక్‌ఖాన్(పెదకూరపాడు), అన్నపురెడ్డి రణధీర్‌రెడ్డి (మాచర్ల), కొండవజ్ఝ వెంకటసుబ్రమణ్యం(వినుకొండ), షేక్ కరిముల్లా (నరసరావుపేట), షేక్ బాషా (చిలకలూరిపేట), ఇర్ల వెంకటశివ (గురజాల) నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ నాగూల్‌మీరా, ఆరేటి మల్లికార్జున (సత్తెనపల్లి), బొమ్మిరెడ్డి గోపీనాథరెడ్డి, చాదాపొంగు అరుణ(గురజాల), కారసాల రత్నకుమార్, షేక్ సాబువర్మ (చిలకలూరిపేట), తిగురి తిరుపతి రెడ్డి, బొబ్బా రాజశేఖరరెడ్డి, చల్లా శివారెడ్డి (మాచర్ల), ఫణిదెపు మంగారావు, దొరొట్ల రవి (వినుకొండ), మక్కిన ఉదయ్, మార్కాపుడి ధనుష్ (పెదకూరపాడు), విరామరాజు సాయికృష్ణ (చెర్రీ), పోలం బ్రహ్మారెడ్డి (నరసరావుపేట) నియమితులయ్యారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు

రెంటచింతల: రెంటచింతల పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐకి సూచించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల జరిగే ప్రమాదాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. గ్రామాలలో చిన్న చిన్న విషయాలకే ప్రజలు ఆవేశంతో ఘర్షణ పడుతున్నారన్నారు. ఏ ప్రాంతంలోనైనా గొడవ జరుగుతుందని తెలిసిన వెంటనే పోలీసులు వారిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి, సర్దుబాటు చేయడంపై కూడా దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ సీహెచ్ నాగార్జున పాల్గొన్నారు.


ఎన్ఎంఎంఎస్ గడువు పొడిగింపు



ఎల్.చంద్రకళ, డీఈఓ

నరసరావుపేట ఈస్ట్: దేశ వ్యాప్తంగా డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రుసుం చెల్లించేందుకు ఈనెల 27వ తేదీ వరకు గడువు పొడించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ వెబ్‌సైట్ www.bre.ap.gov.in అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ అనంతరం సంబంధిత ప్రింటెడ్ నామినల్ రోల్స్‌ను ఈనెల 29వ తేదీ లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. విద్యాశాఖాధికారి లాగిన్‌లో దరఖాస్తును ఈనెల 31వ తేదీలోగా ధ్రువీకరించాల్సి ఉందని తెలిపారు. గడువు పొడగింపునకు ఇదే చివరి అవకాశంగా గుర్తించాలని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ప్రాథమికోన్నత, ఎయిడెడ్, వసతి లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి తగిన విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. దరఖాస్తు నమోదులో ఆధార్ కార్డులో ఉన్న విధంగా విద్యార్థి పేరు నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసేందుకు ఎటువంటి ధ్రువ పత్రాలు అవసరం లేదనీ, పరీక్ష రాసే సమయంలో అన్ని సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ వెబ్‌సైట్, డీఈఓ కార్యాలయంలోని డిఎస్ఓ పి.శంకరరాజు (9963192487)ను సంప్రదించాలని ఆమె సూచించారు.

కేఎల్‌యూ శాటిలైట్ల ప్రయోగం విజయవంతం



కాన్‌శాట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి భూపతి శ్రీనివాస వర్మ

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయం శనివారం శాటిలైట్లను నింగిలోకి పంపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు, కేఎల్‌యూ వైస్ చైర్మన్ కోనేరు నిఖిల కార్తికేయన్, వీసీ పార్థసారథి వర్మలతో కలిసి కాన్‌శాట్‌ను నింగిలోకి వదిలారు. తొలుత బెలూన్ సహాయంతో మొదటి కేఎల్ జాక్ శాటిలైట్‌ను పంపారు. ఉదయం 5.45 నిమిషాలకు కేఎల్ జాక్ శాటిలైట్‌ను పీకో బెలూన్ సాయంతో వదిలారు. కేఎల్ జాక్ శాటిలైట్ గాలి నాణ్యతపై పరిశోధన చేయనున్నట్లు రూపకర్త డాక్టర్ సిహెచ్ కావ్యశ్రీ తెలిపారు. కేఎల్‌శాట్2ను ఫేలెట్ మోడ్ డ్రోన్ సహాయంతో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఏటీసీ గన్నవరం ఎయిర్ ట్రాఫిక్ క్లియరెన్స్ వచ్చిన తరువాత 6.45 గంటలకు బెంగళూరుకు చెందిన రెడ్‌వింగ్ అనే సంస్థ సహకారంతో ఫేలెట్ మోడ్ డ్రోన్ సాయంతో నింగిలోకి పంపారు. శాటిలైట్ 1 గంట పాటు నిర్దేశిత కక్ష్యలో భూమి నుంచి సుమారు 12 కి.మీ. ఎత్తులో 60 కి.మీ. సమాంతరంగా ప్రయాణించి పరిశోధనలు చేసి మళ్లీ లాండ్‌ప్యాడ్‌పై విజయవంతంగా దిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఈనెల 27న ఉత్తరప్రదేశ్‌లో జరుగనున్న మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ పోటీల్లో కేఎల్‌యూ విద్యార్థులు రూపొందించిన కాన్‌శాట్ ఉపగ్రహం ఏపీ నుంచి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

